క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు



శివాజీనగర్-2 శివాలయంలో నీటి కుండీలో దీపాలు విడిచిపెడుతున్న మహిళలు

ఆరిలోవ: కార్తీక మాసం ముగియడంతో పోలిపాడ్యమిని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆరిలోవ ప్రాంతంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక మాసం ప్రారంభం నుంచి రోజూ వేకువ జాము నుంచి శివ పూజలు చేశారు. పల్లెల్లో మాదిరిగా ఇక్కడ చెరువులు లేకపోవడంతో చేతి బోర్లు వద్ద స్నానాలు చేసి చిన్న పళ్లెంలో నీళ్లు పోసి దీపాలు వెలిగించేవారు. పోలుపాడ్యమి సందర్భంగా బుధవారం వేకువన మహిళలు తమ ఇళ్ల ముందే తులసి మొక్కలకు పూజలు చేసి, వాటి ముందు పెద్ద పళ్లెంలో నీరు పోసి అరటి బోదెలలో దీపాలు వెలిగించి కార్తీక మాసానికి ముగింపు పలికారు. ఇంకొందరు శివాలయాలలో ఆలయాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన తాత్కాలిక నీటి కొలనులో దీపాలు విడిచిపెట్టి పూజలు చేశారు.

జూలో వెటర్నరీ వైద్యుడి పోస్టు భర్తీ

ఆరిలోవ: జూలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఒక వెటర్నరీ వైద్యుడి పోస్టు భర్తీ చేయనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం ఈ నెల 20 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నెలకు రూ.50 వేలు వేతనం చెల్లించనున్నామని, ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు జూ క్యూరేటర్ ఆఫీస్‌లో నేరుగా దరఖాస్తు అందజేయాలన్నారు. అందిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

వినూత్న కథాంశంతో ‘లతమరబా’



లతమరబా నాటికలో సన్నివేశం

మద్దిలపాలెం : జానపద కథ అంశంగా రచించిన నాటిక లతమరబా. ఎదురుకాళ్లతో పుట్టిన బిడ్డ భవిష్యత్ ఆధారంగా సాగిన వినూత్న కథాంశం ఇది. అసాధారణ శక్తులు ఎదురుకాళ్లతో పుట్టిన బిడ్డకు ఉంటాయనే విశ్వాసంతో కథను ఎంతో చక్కగా రక్తికట్టించారు. ఈ నాటిక తిలకిస్తున్న ప్రేక్షకులు తనయత్వానికి లోనయ్యారు. రసజ్ఞ జాతీయ బాషా నాటకోత్సవాలలో భాగంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బుధవారం లతమరబా నాటికను రసజ్ఞ 8వ నాటక ప్రదర్శనలను రెండో రోజు ప్రదర్శించారు. ఈ నాటికకు నీరజ్‌కుమార్ దర్శకతం వహించగా.. నాటికను రోషని ప్రసాద్ మిశ్ర రచించారు.

యువకుడిపై హత్యాయత్నం

ఆరిలోవ: ఇద్దరి స్నేహితుల మధ్య జరిగిన గొడవ ఓ యువకుడిపై హత్యాయత్నానికి దారి తీసింది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవకు చెందిన మోహన్, బాలు అనే యువకులు చినగదిలి సాయిబాబా గుడి వద్ద బుధవారం ఘర్షణ పడుతుండగా.. కొంగరాపు రవితేజ అనే మరో యువకుడు వెళ్లాడు. ఈ ముగ్గురూ స్నేహితులే. కేటరింగ్ పనులు చేస్తున్నారు. ఈ గొడవలో బాలును కొడుతున్న మోహన్‌ని ఎందుకు కొడుతున్నావంటూ రవి నిలదీశాడు. దీంతో మోహన్ కోపంతో అతని వద్ద ఉన్న చాక్‌తో రవి వీపుపై పొడిచి పరారయ్యాడు. దీంతో అక్కడకు చేరుకున్న మరో స్నేహితుడు రవిని వెంటనే విమ్స్‌కు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. రవి ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు ప్రాణాపాయంలేదని సీఐ సోమశేఖర్ తెలిపారు. రవిపై దాడికి పాల్పడిన మోహన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రీడా మణిహారం ‘స్పోర్ట్స్ ఎరీనా’



ఎంవీపీ కాలనీలో నిర్మించిన స్పోర్ట్స్ ఎరీనా

- 1.5 ఎకరాల్లో రూ.24 కోట్లతో నిర్మాణం
- అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ
- సెంట్రల్ ఏసీ, స్విమ్మింగ్ పూల్
- ఇండోర్ స్పోర్ట్స్ సౌకర్యం



ఎంవీపీకాలనీ: క్రీడాకారులకు వరల్డ్‌క్లాస్ సౌకర్యాలు దిశగా విశాఖ మహా నగరం ముందడుగు వేసింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న అవకాశాల నేపథ్యంలో వాటిని నగర యువత సమర్థవంతంగా అందిపుచ్చుకునే దిశగా ప్రభుత్వం ప్రోత్సాహన్ని అందించింది. ఎంవీపీ కాలనీలో 7స్టార్ హోటల్ ఫెసిలిటీస్‌తో రూ.24 కోట్లతో స్పోర్ట్స్ ఎరీనాను అందుబాటులోకి తెచ్చింది. మారుతున్న క్రీడా అవసరాలకు అనుగుణంగా ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన ఈ ప్రాజెక్టు నగరానికి క్రీడా మణిహారంగా వెలుగొందుతోంది. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో జీవీఎంసీ వరల్డ్ క్లాస్ ఫెసిలిటీస్‌తో అందుబాటులోకి తెచ్చిన ఈ స్పోర్ట్స్ ఎరీనా ఈతరం క్రీడాకారులకు కొండంత భరోసానిస్తోంది.

బహుళ క్రీడల ప్రోత్సాహమే లక్ష్యం

నగరంలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం ఒక్కటే దశాబ్దాలుగా బహుళ క్రీడలకు వేదికగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ దిశా నిర్దేశంతో మారుతున్న క్రీడా అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలతో మరో అధునాతన ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తేవాలనే జీవీఎంసీ సంకల్పించింది. ఈ నేపథ్యంలో నగరానికి నడిబొడ్డున ఎంవీపీ కాలనీలో 1.5 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించింది. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ స్పోర్ట్స్ ఎరీనా నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.24 కోట్లకు పైగా వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసుకొని గత నాలుగు నెలలుగా నగర క్రీడాకారులకు విశిష్ట సేవలు అందిస్తోంది.



అధునాతన స్విమ్మింగ్ పూల్

వరల్డ్‌క్లాస్ సౌకర్యాలతో నిర్మాణం

ఈ ప్రాజెక్టులో భాగంగా ఇండోర్ స్టేడియాన్ని పూర్తి సెంట్రల్ ఏసీ సామర్థ్యంతో తీర్చిదిద్దారు. సీలింగ్, సింథటిక్ ఫ్లోరింగ్ సౌకర్యాలతో ఆధునిక సౌకర్యాలు కల్పించారు. సింథటిక్ వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, బాస్కెట్‌బాల్ కోర్టు, షటిల్ కోర్ట్స్, వాలీబాల్ కోర్టు, చెస్ క్యాబిన్, యోగా క్యాబిన్, సువిశాలమైన స్విమింగ్‌పూల్ వంటి మల్టీపర్పస్ సౌకర్యాలతో 1.5 ఎకరాల స్థలంలో ఈ స్పోర్ట్స్ ఎరీనాను నిర్మించారు. బాస్కెట్‌బాల్ కోర్టు, ఆడియన్స్ గ్యాలరీలు అవసరం మేరకు మాత్రమే వినియోగించుకొని విధంగా ఆధునాతన సాంకేతికతను తొలిసారి ఉపయోగించారు. ఇతర క్రీడలు జరిగినప్పుడు ఆడియన్స్ గ్యాలరీ లోపలకు ముడుచుకోవడం దీని ప్రత్యేకత. సౌండ్ ప్రూఫ్, హీట్ ప్రూఫ్ టెక్నాలజీలను నిర్మాణంలో వినియోగించి వరల్డ్‌క్లాస్ సౌకర్యాలు కల్పించారు.

రెండింటా వరల్డ్ క్లాస్‌గా..



ఎరీనా నిర్వహణతో పాటు శిక్షణ విషయంలో వరల్డ్‌క్లాస్ ప్రమాణాలను పాటిస్తున్నాం. దేశంలోని మరే ఇతర నగరంలోను ఇంత తక్కువ ఫీజుతో ఈ స్థాయిలో క్రీడా సౌకర్యాలు అందుబాటులో లేవు. ప్రస్తుతం 200 మందికి పైగా స్కూల్ నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. అన్ని రకాల శిక్షణలకు ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ ఉన్న వరల్డ్‌క్లాస్ సర్టిఫైడ్ కోచ్‌లను అందుబాటులో ఉంచాం. ఫిట్‌నెస్ + కోచింగ్‌పై విధానంతో శిక్షణ ఉంటుంది. దీంతో క్రీడాకారులకు హైలెవల్ కోచింగ్ లభిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఏరీనా శుభ్రత విషయంలోను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఇలాంటి వరల్డ్ క్లాస్ సౌకర్యాలతో ఏపీలో ప్రథమంగా నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇదే.

–సహాని, స్పోర్ట్స్ ఎరీనా నిర్వాహకుడు, ఎస్3 స్పోర్ట్స్ సంస్థ ప్రతినిధి



బహుళ క్రీడల కోసం అభివృద్ధి చేసిన ఇండోర్ స్టేడియం లోపల భాగం

శిక్షణలో ప్రత్యేక శ్రద్ధ



ఇక్కడ అనుభవజ్ఞులైన కోచ్‌లు ఉన్నారు. ప్రతి విద్యార్థిపైనా పూర్తి శ్రద్ధ తీసుకుంటున్నారు. అనేక రకాల క్రీడలకు ఇక్కడ శిక్షణ అందుబాటులో ఉంది. మా అబ్బాయిని స్విమింగ్ శిక్షణ కోసం జాయిన్ చేశాం. రెండు వారాల్లోనే మంచి పరిణితి కనబరుస్తున్నాడు. ఈ స్పోర్ట్ కాంప్లెక్స్ నగర వాసులకు అత్యంత ఉపయుక్తంగా నిలుస్తోంది. – ప్రియాంక, క్రీడాకారుని తల్లి

నిర్వహణ చాలా బాగుంది



నగరంలో వరల్డ్ క్లాస్ సౌకర్యాలతో ఇలాంటి స్పోర్ట్స్ ఎరీనాను అందుబాటులోకి తేవడం అభినందనీయం. నిర్మాణం విషయంలో జీవీఎంసీ చాలా శ్రద్ధ తీసుకుంది. తక్కువ సమయంలోనే ఎరీనాకు మంచి గుర్తింపు లభిస్తోంది. ఏరీనాలో శుభ్రతకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ప్రధానంగా శిక్షణలో ఫీల్డ్ ట్రైనింగ్, మెలకువల ద్వారా చిన్నారులకు మంచి లబ్ధి చేకూరుతుంది. – కామేశ్వరి, క్రీడాకారుని తల్లి

బహుళ క్రీడా నైపుణ్యానికి వేదిక



ఈ స్పోర్ట్స్ క్లాంపెక్స్ ద్వారా పిల్లలు వారి ఆసక్తికి అనుగుణంగా బహుళ క్రీడల్లో నైపుణ్యం సాధించేందుకు అవకాశం ఉంది. ఫిట్‌నెస్‌తో పాటు క్రీడా కోచింగ్‌లోను శిక్షకులు ప్రత్యేకత చాటుతున్నారు. దీంతో పిల్లలకు మంచి క్రీడా సామర్థ్యం లభిస్తోంది. పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించేందుకు నగరంలోని ప్రతి ఒక్కరికీ ఈ సౌకర్యం అందుబాటులో ఉంది. – అనూష, క్రీడాకారుని తల్లి

ఏయూ సమాచారమ్

విద్యా భారతి అధ్యక్షుడు దూసి సందర్శన



దూసి రామకృష్ణను సత్కరిస్తున్న వీసీ సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని విద్యా భారతి అఖిల భారత అధ్యక్షుడు దూసి రామకృష్ణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమతతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. వర్సిటీ తరఫున దూసి రామకృష్ణను వీసీ ఆచార్య కె.సమత సత్కరించారు. కార్యక్రమంలో ఏయూ మాజీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ప్రత్యేక యోగ తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి జనరల్, స్థూలకాయ, థెరపటిక్, వెన్ను నొప్పి, మెడనొప్పి నివారణకు ప్రత్యేక యోగా శిబిరాలు నిర్వహించనున్నట్టు కేంద్రం గౌరవ సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 93980 19922, 94944 01919, 83743 51324 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు యోగా తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

19న ఏయూలో ఉచిత ఆక్యుపంచర్ శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 19న ఉచిత ఆక్యుపంచర్ శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. నిపుణులైన వైద్య బృందం వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్న వారికి ఆక్యుపంచర్ విధానంలో చికిత్స అందిస్తారని తెలిపారు. డయాబెటిస్, బీపీ, సయాటికా, వేరికోస్ వెయిన్స్, ఆస్తమా, సైనస్, మలబద్ధకం, వెన్నుపూసకు సంబంధించిన సమస్యలకు ఈ శిబిరంలో ఉచిత చికిత్స అందిస్తారన్నారు.

గాంధీ తత్వం అలవర్చుకోవాలి



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు బాలమోహన్‌దాస్, సుదర్శన్‌రావు

మద్దిలపాలెం : మహాత్మా గాంధీ తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ తత్వంపై బుధవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఉప కులపతి ఆచార్య కె.బాలమోహన్‌దాస్, విక్రమ్ సింహపురి విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి ఆర్.సుదర్శన్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుడుతూ గాంధీ తత్వం గురించి వివరించారు. మానవత విలువలను విద్యార్థులు గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, కళా భారతి కార్యదర్శి వి.ఆర్.కె.రాంబాబు, రమణమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు కోసం ఢిల్లీలో పోరాటం



పోరాటంలో పాల్గొన్న జిల్లా నాయకులు

బీచ్ రోడ్డు: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్, మహిళా బిల్లులలో బీసీ మహిళలకు సబ్ కోటా, కేంద్రంలో ఓబీసీలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని నినదించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, విశాఖ జిల్లా బీసీ సంక్షేమ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, పార్టీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, ఏపీ పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, గేదెల నాగరాజు, అప్పారి గిరిబాబు, సురాడ దాసు, మడుపాడు రవి తదితరులు పాల్గొన్నారు.

13 ఆటోలపై కేసులు

గోపాలపట్నం: మద్దిలపాలెం, ఎన్‌ఏడీ ప్రాంతాల్లో బుధవారం రవాణా శాఖ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 13 స్కూల్ ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు ఉపరవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. ఈ నెల 11 నుంచి చేపట్టిన తనిఖీల్లో 36 ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులు, విద్యార్థులను ఎక్కించవద్దని సూచించారు. తనిఖీల్లో అధికారులు రాజారావు, గణేష్ రెడ్డి, మాధవి, ఎస్.శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

ఎన్‌ఏడీలో ప్రత్యేక తనిఖీలు

రహదారి భద్రత నిబంధనలు పాటించని ద్విచక్ర వాహనాలపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఎన్ఎస్‌టీఎల్ నుంచి వంటిల్లు వైపునకు రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాలు, ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పై వెళ్లే వాహనాలను తనిఖీ చేసి.. 38 వాహనాలపై కేసులు నమోదు చేశారు. వాహనచోదకులకు అవగాహన కల్పించారు. భారీ వాహనాలు మాత్రమే ఫ్లైఓవర్‌పై వెళ్లాలని డీటీసీ సూచించారు. అధికారులు రామ్‌కుమార్, సుధీర్, ఏఎస్ ప్రకాష్‌రావు, శిరీష, శిరీషాదేవి తదితరులు పాల్గొన్నారు.

18న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవం

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి షష్టి మహోత్సవాన్ని ఈ నెల 18న నిర్వహించనున్నట్టు కార్యనిర్వాహణాధికారి శేఖర్‌బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆలయ ఆవరణలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో పూజలు నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరువీధి మహోత్సవం, సాయంత్రం 6.30 గంటల నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణమహోత్సం జరగనుందన్నారు. స్వామి వారి కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.300 రుసుము చెల్లించాలన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ నక్క అప్పలరెడ్డి, సభ్యులు నక్క నాగమణి, ప్రవీణ్ కుమార్‌రాజు, సంతోష్‌బాయి పాల్గొన్నారు.

బోని విజయలక్ష్మికి ఘన నివాళి



విజయలక్ష్మి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జీవీ, తదితరులు

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ తల్లి విజయలక్ష్మి దశదిన కార్యక్రమం బుధవారం ఆరిలోవలో జరిగింది. ఆమె ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. దశదిన కార్యక్రమానికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహమాన్, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, జిల్లా వైల్డ్‌లైఫ్ వార్డెన్ సత్తి మందాడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జీవీ, గొలగాని శ్రీనివాస్, చొక్కర శేఖర్, కన్నేటి సుబ్బారెడ్డి హాజరై ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చిన్నారులకు శతశాతం వ్యాధి నిరోధక టీకాలివ్వాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం కేజీహెచ్‌లోని ప్రత్యేక పిల్లల వార్డును సందర్శించారు. వైద్య పరికరాల ఆవశ్యకత గురించి విభాగాధిపతి డాక్టర్ ఎం.ఎస్.రాజుతో చర్చించారు. చిన్నారులకు శతశాతం వ్యాధి నిరోధక టీకాలివ్వాలన్నారు. 12 వారాలలోపు గర్భిణులను నమోదు చేయాలని, వారు పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలన్నారు. నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ జీవీ
- 15వ వార్డులో ‘ఏపీకి జగనే ఎందుకు కావాలంటే..’



ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న గన్నమనేని వెంకటేశ్వరరావు, అప్పారి శ్రీవిద్య

మద్దిలపాలెం : అభివృద్ధి, సంక్షేమం అంటే ఇది అని తన పాలనతో రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపించారని గోపాలపురం పరిశీలకుడు, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు(జీవీ) అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని 15వ వార్డులో బుధవారం స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను జీవీ ఆవిష్కరించారు. వార్డులో అభివృద్ధి పనులకు సంబంధించిన పట్టిన బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్న పథకాలు పేదల జీవితాలలో వెలుగులు నింపాయన్నారు. అందుకే రాష్ట్రానికి మళ్లీ జగనన్న కావాలని రాష్ట్ర ప్రజలు ముక్త కంఠంతో కోరకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పీలా వెంకట్, నరాల సత్తిబాబు, త్రినాథరావు, ఏసురత్నం, అచ్యుత, దిలీప్, రాజారావు పాల్గొన్నారు.

అగర్‌బత్తుల తయారీలో ఉచిత శిక్షణ



అగర్‌బత్తీ తయారీలో శిక్షణ పొందుతున్న మహిళలు

దాబాగార్డెన్స్ : నగరంలోని హవా మహల్ ప్రాంగణంలో ఇంటెక్ విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధి కల్పించే దిశగా, వినియోగించిన పుష్పాలతో అగర్‌బత్తులు తయారు చేసే విధానంపై ఉచిత శిక్షణను జైపూర్ రాజమాత మయాంక్ కుమార్‌దేవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ ద్వారా మధ్య తరగతి మహిళలు ఉపాధి పొందాలన్నారు. ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ డి. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఇంటెక్ సహకారంతో దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా విశాఖపట్నంలో అగర్‌బత్తీ తయారీలో ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. కో కన్వీనర్ డాక్టర్ బి. సురేంద్రకుమార్ మాట్లాడుతూ ఇంట్లో, దేవాలయంలో పూజకు వినియోగించిన పుష్పాలు బయట పారేయకుండా సంస్థకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలకు లక్నోకి చెందిన డాక్టర్ రమేష్ శ్రీవత్సవ్, ప్రియాంక సింగ్, సాక్షి అవస్తి అగరబత్తీ తయారీ విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో ఎడ్వర్డ్‌పాల్, చిట్లూరి గిరిధర్, ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘విలువైన వస్తువులు జాగ్రత్తగా చూసుకోండి’

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దర్శనానికి విచ్చేసే భక్తులు విలువైన వస్తువులు, మనీపర్స్‌లు, హ్యాండ్ బ్యాగులు, సెల్‌ఫోన్లు జాగ్రత్తగా చూసుకోవాలని వన్‌టౌన్ క్రైమ్ ఎస్ఐ ఎస్. రామ్మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టూవీలర్స్ పార్క్ చేసేటపుడు హ్యాండిల్ లాక్ సరిగ్గా వేసుకోవాలని, క్యూలైన్లలో మీకు తెలియకుండానే మీ హ్యాండ్‌బ్యాగుల నుంచి విలువైన వస్తువులు దోచుకుపోతారని, మీ మెడలో ఉన్న వస్తువులు మీకు తెలియకుండానే రద్దీగా ఉండే టప్పుడు తెంపుకుపోతారని చెప్పారు. నిర్మానుష్యంగా ఉండే ప్రదేశాల్లోకి వెళ్లేటప్పుడు కూడా మీ వస్త్రాన్ని మెడపై ధరించి వెళ్లాలని, ఆలయ పరిసర ప్రాంతాలు, క్యూలైన్లలో సీసీ కెమెరా నిఘాను పర్యవేక్షించడానికి కమాండ్ కంట్రోల్ కూడా ఏర్పాటు చేశామన్నారు. క్రైం పోలీసులు యూనిఫాం, మఫ్టీలో పర్యవేక్షిస్తుంటారని, ఎవరైనా అనుమానంగా ఉన్నట్టు కనిపించినా, దొంగతనం చేసినట్టు చూసినా సమీపంలో గల పోలీసులకు అప్పగించాలన్నారు.

ఫిల్మ్ మేకింగ్‌లో వర్క్‌షాపు నిర్వహిస్తా



ఎల్.బి.శ్రీరామ్‌తో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతమ్మధార : నగరంలోని పలు కార్యక్రమల్లో పాల్గొనడానికి వచ్చిన సీనియర్ నటుడు ఎల్.బి.శ్రీరామ్‌ను బుధవారం గురుద్వార్ దరి ఓ హోటల్‌లో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్యదర్శి నరవ ప్రకాష్ మాట్లాడుతూ సినియాల్లో నటించకున్న లఘు చిత్రాల నిర్మాణం ద్వారా యువతకు మార్గదర్శకంగా ఉన్నారని అభినందించారు. విశాఖలో లఘు చిత్రాల నిర్మాణం అంశంపై వర్క్‌షాపు నిర్వహించాలని కోరారు. ఎల్.బి. శ్రీరామ్ మాట్లాడుతూ చిత్ర నిర్మాణానికి అవసరమైన అన్ని హంగులు విశాఖలో ఉన్నాయని ప్రభుత్వం ఆ దిశగా అడుగులు ముందుకు వేయాలన్నారు. అందుకు తనవంతు ఫిల్మ్ మేకింగ్ వర్క్‌షాపు నిర్వహించే ఆలోచన ఉందన్నారు. ఈకార్యక్రమంలో సూర్యప్రకాష్ రావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రెండున్నర కేజీల గంజాయి పట్టివేత

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఐదో పట్టణ పోలీసులు సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ మెహదీపట్నాకి చెందిన టి.భానుకిరణ్ (25) మంగళవారం మధ్యాహ్నం కంచరపాలెం బ్రిడ్జ్ నుంచి జ్ఞానాపురం వెళ్లే మార్గంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడని సమాచారం అందుకుని దాడి చేయగా..బ్యాగ్‌లో 2.5 కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. విశాఖ నుంచి హైదరాబాద్‌కు తీసుకువెళ్తున్నట్టు విచారణలో తేలింది. కంచరపాలెం సీఐ నిందితుడ్ని అదుపులోకి తీసుకుని, గంజాయి స్వాధీనం చేసు కుని బుధవారం రిమాండ్‌కు తరలించారు.